క్లుప్తంగా

కొల్లు రవీంద్ర ప్రచారంలో అంగన్‌వాడీ ఆయా



చిలకలపూడి(మచిలీపట్నం): టీడీపీ బందరు అభ్యర్థి కొల్లు రవీంద్ర ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ ఆయా పాల్గొనడం చర్చనీయాంశమైంది. రుద్రవరంలో శనివారం కొల్లు రవీంద్ర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో ఆ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా పాతపాటి రూప పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అంగన్‌వాడీ ఆయా ప్రచారంలో పాల్గొనడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



చిరువోలు(మోపిదేవి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. మండల పరిధిలోని చిరువోలు గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యాన.. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని 150 మంది ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు 'గూడూరు'లో ఉప్పాల రోడ్ షో


గూడూరు: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము ఆదివారం గూడూరు మండలంలో రోడ్ షో నిర్వహిస్తున్నట్లు పార్టీ గూడూరు మండల అధ్యక్షుడు పర్లం మహాలక్ష్మయ్య నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 8 గంటలకు చిట్టిగూడూరులో ప్రారంభమయ్యే రోడ్ షో తరకటూరుపాలెం, పర్ణశాల, తరకటూరు, మద్దిపట్ల, కంచాకోడూరు, రాయవరం , పోలవరం, ఐదుగుళ్లపల్లి, రామన్నపేట, మల్లవోలు, ఆకుమర్రు, రామరాజుపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా మంగళగిరి వాస్తవ్యులు లంకా జగదీష్ బాబు, సమ్య దంపతులు రూ. 50 వేలు విరాళంగా సమర్పించుకున్నారు. శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు విరాళ నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం



చల్లపల్లి: అంబులెన్స్ అదుపుతప్పి ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగింది. శనివారం మధ్యాహ్నం స్థానిక బైపాస్ రోడ్డులో నారాయణరావు నగర్ వైపు ఉన్న బజారు మలుపులో ఉన్న విద్యుత్ స్తంభాన్ని 108 అంబులెన్స్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోయి విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఏఈఈ కె.అరవింద్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది స్పందించి వెంటనే నూతన స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

జగన్‌తోనే నిరుపేదల ఉన్నతి

ఉప్పాల రమేష్(రాము)



పెడన మండలంలో ఓట్లను అభ్యర్థిస్తున్న ఉప్పాల రమేష్

పెడన: నిరుపేదల ఉన్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని ఆయన్నే మళ్లీ సీఎంగా ఎన్నుకుందామని వైఎస్సార్ సీపీ పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. ఆయన మండలంలో శనివారం విజయీభవ యాత్ర నిర్వహించి ఓట్ల అభ్యర్థించారు. గ్రామాల్లో అవ్వతాతలను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకుని జగన్ వస్తే పింఛను కష్టాలు తప్పుతాయని వివరించారు. కొంగంచర్లలో ప్రారంభమైన విజయీభవ యాత్ర గురువిందగుంట, కవిపురం, ముచ్చర్ల, ముచ్చలిగుంట, చేవేంద్రపాలెం, కమలాపురం, చెన్నూరు, ఉప్పలకలుగుంటపాలెం గ్రామాలలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పాల రమేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళారులు, జన్మభూమి కమిటీలు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలు ద్వారా సంక్షేమ ఫలాలను అందించారని గుర్తు చేశారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇంటికి తీసుకువెళ్లి ఇస్తుంటే వారిని కాదని సచివాలయాల్లోను ఇప్పించడం, తాజాగా బ్యాంకుల్లో జమ చేయడం వంటివి టీడీపీ పన్నిన పన్నాగాలతో వృద్ధులు, వితంతు మహిళలు, వికలాంగులు పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. అటువంటి వారిని నమ్మొద్దని, మంచి చేస్తున్న వారిని గుర్తుంచుకోవాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లు కూడా ఫ్యాను గుర్తుకు వేయాలని సూచించారు. ఆయన వెంట పెడన ఏఎంసీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి,



ఓట్లను అభ్యర్థిస్తున్న ఉప్పాల రమేష్ సోదరి అనురాధ తదితరులు

ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, పార్టీ నాయకులు వెంకటరామానాయుడు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండమ్మ బొట్టు పెడతా

ఉండమ్మ బొట్టు పెడతా.. మరచిపోకుండా ఫ్యాను గుర్తుకు ఓటేయండి అంటూ పెడన వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) సోదరి అనురాధ మహిళా ఓటర్లను కలిసి బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. శనివారం ఉదయం ఆమె నడుపూరు, మెరికేపాలెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. నేతలు సింగంశెట్టి రాంబాబు, అశోక్, మాజీ ఎంపీటీసీ వజ్జి విజయకుమారి తదితరులున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో సందేహాలను నివృత్తి చేయండి

నందమూరు పెసిలిటేషన్ సెంటరును పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజీ



నందమూరు వాసవి ఇంజనీరింగ్ కాలేజీలోని పెసిలిటేషన్ సెంటరులో మాట్లాడుతున్న బాలాజీ

పెడన: పోస్టల్ బ్యాలెట్‌లో సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పెసిలిటేషన్ సెంటరులోని సిబ్బంది తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శనివారం ఉదయం ఆయన పెడన మండలం నందమూరు శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటరును ఆకస్మికంగా పరిశీలించారు. అదే సమయంలో పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకునేందుకు పీవోలు, ఏపీవోలు రద్దీ ఎక్కువగా ఉండటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూ లైన్, రద్దీ లేకుండా చూడాలని ఏఈఆర్వో, బంటుమిల్లి తహసీల్దారు వై.రవికుమార్‌ను ఆదేశించారు. అనంతరం సిబ్బందికి పోస్టల్‌బ్యాలెట్ వినియోగం, సందేహాలపై దిశానిర్దేశం చేశారు. పోస్టల్ ఓటింగ్ కోసం పార్లమెంటు, అసెంబ్లీలకు వేర్వేరుగా ఓటింగ్ వేసేందుకు కంపార్ట్‌మెంట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెడన సహాయ రిటర్నింగ్ అధికారి, బంటుమిల్లి తహసీలారు వై.రవికుమార్ ఫెసిలిటేషన్ సెంటర్ వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు.

పేదలకు అండగా జగనన్న..

మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు



పెదకళ్లేపల్లి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పేద వర్గాలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ తోడుగా ఉండాలని మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు కోరారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో శనివారం సాయంత్రం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రతి ఇంటికి మేలుచేసిన జగనన్నను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్య, వైద్యం అందాలన్నా, రైతాంగాన్నికి మేలు జరగాలంటే వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని విన్నవించారు. ప్రతి ఇంటికి సంక్షేమ పాలన రావాలన్నా, గ్రామం అభివృద్ధి చెందాలన్నా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు(తనకు)కు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో అందరినీ పేరు పేరునా పరిచయం చేసుకుంటూ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపారు.

కాలిఫోర్నియాలో 'బందరు' పూర్వవిద్యార్థులు



కాలిఫోర్నియాలో జరిగిన పూర్వవిద్యార్థుల కలయికలో మచిలీపట్నంవాసులు

మచిలీపట్నంటౌన్: బందరుకు చెందిన పూర్వ విద్యార్థులు అమెరికాలోని కాలిఫోర్నియాలో శుక్రవారం రాత్రి కలుసుకున్నారు. మచిలీపట్నంలోని స్కూళ్లు, కళాశాలల్లో కలిసి చదువుకుని అమెరికాలో స్థిరపడి వివిధ వృత్తుల్లో ఉన్న బందరువాసులు కలుసుకుని ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని మధురస్మృతులను నెమరువేసుకున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు మద్దుల గిరీష్‌కుమార్, ఆలీవ్ మిఠాయి షాప్ అధినేత దొరరాజు ల ఆధ్వర్యంలో కాలిఫోర్నియా లోని మిల్పిటాస్ నగరంలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ సిలికానాంధ్రలో పూర్వవిద్యార్థుల కలయిక కార్యక్రమంలో పాల్గొన్నారు. జన్మభూమి రుణం తీర్చుకునేందుకు సాయం అందిస్తామని ప్రతి ఒక్కరూ ప్రతినబూనారు.

జోరుగా ప్రచారం



గూడూరు: వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా పార్టీ శ్రేణులు గూడూరు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సర్పంచి బొర్రా సాంబశివయ్య, పీఏసీఎస్ చైర్మన్ దాసరి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు పిట్ల రామిరెడ్డి పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

చల్లపల్లి: రాష్ట్రంలో ముస్లిం ఓట్లు ఈసారి కూడా వైఎస్సార్ సీపీకే వేస్తారని ఏపీ ఉర్దూ అకాడమి డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా అన్నారు. శనివారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి స్థానిక 69వ పోలింగ్ బూత్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికార దాహంతో మతోన్మాద బీజేపీతో జతకట్టిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ముస్లింలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ముస్లింలకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చిన జగన్ మోహన్‌రెడ్డి నిరుపేద ముస్లింల ఆర్థిక ప్రగతికి కృషి చేశారన్నారు. స్థానిక 62వ పోలింగ్ బూత్ పరిధిలో షేక్ రసూల్ ఫెహరీ, మహమ్మద్ కమాల్ ఆధ్వర్యంలో, 72వ పోలింగ్ బూత్ పరిధిలో తుమ్మల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, పడమర వైపు వెనిగళ్ల జగదీష్, పాగోలు నాగ సీతారామారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, సయ్యద్ జహీర్, పాశర్ల మనోజ్, ఎండీ.ముజీబ్, అబ్దుల్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

గుడివాడ టౌన్: నేత్రదానంతో మనిషి మరణించినా లోకాన్ని చూడవచ్చునని కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన బాల నాగు మాణిక్యాలరావు కార్నియాలను (ఐబాల్స్) ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సేకరించినట్లు తెలిపారు. సేకరించిన ఐబాల్స్‌ను విజయవాడ అగర్వాల్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

105 మందికి ఉపకారవేతనాల పంపిణీ

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో 105 మంది విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కాలేజీలో చదువుతున్న ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు నార్త్‌సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లయన్ గవర్నర్ శంకర్ గుప్తా 105 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.26,25,000 లక్షలు విలువైన చెక్కులను అందజేశారు. లయన్స్ అచ్యుతబాబు, శ్రీనివారావు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోనే ప్రోగ్రెస్ కార్డ్

- దమ్మున్న నాయకుడు సీఎం జగన్
- మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు



పేర్ని కిట్టుకు హారతి ఇస్తున్న మహిళ

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో ఐదేళ్లు సంక్షేమ పథకాలను అందించే మేనిఫెస్టోనే ప్రోగ్రెస్ కార్డుగా పంపి ఓట్లు అడుగుతున్న దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 10 డివిజన్లలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. పేర్ని కిట్టుకు మహిళలు మంగళహారతులు ఇచ్చి నుదుటన తిలకం దిద్దారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. నగరంలోని 26వ డివిజన్‌లో ప్రారంభమైన ఈ రోడ్‌షో దాదాపు 10 డివిజన్లలో కొనసాగగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబాలతో పాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

మంచి చేసే ప్రభుత్వానికి ఓటేయండి



కోడూరు సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు కోరారు. శనివారం మండలంలో నిర్వహించిన రోడ్ షో ముగింపు సభను కోడూరు ప్రధాన సెంటర్‌లో నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చారని రమేష్‌బాబు తెలిపారు. ప్రధాన సమస్యలైన 22ఏ నిషేధిత భూముల సమస్య, అవనిగడ్డలో కిడ్నీ డైయాలసిస్ సెంటర్ ఏర్పాటు, కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణం వంటి పనులు చేసి మళ్లీ ఓటు అడిగేందుకు వచ్చామన్నారు. అవకాశాన్ని బట్టి కండువాలు మార్చే మండలి బుద్ధప్రసాద్‌ను నమ్మితే తీవ్రంగా నష్టపోక తప్పదని రమేష్‌బాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఎంపీగా గెలిచి ఇప్పుడు జనసేనలో చేరిన బాలశౌరి నీచరాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చానని, మళ్లీ ఈ ఎన్నికల్లో కూడా ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని రమేషబాబు అన్నారు. ఎమ్మెల్యేగా తనని, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని రమేష్‌బాబు కోరారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, యువనేత కడవకొల్లు చైతన్య, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, కోట పద్మావతి వరప్రసాద్, వెన్నా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్ల ఘనత జగన్‌దే..

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామంలో ఓట్లు అభ్యర్థిస్తున్న హారిక

బంటుమిల్లి: వలంటీర్ల సహకారంతో ఇంటి ముంగిట పింఛన్లు అందచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దుక్కుతుందని ఉమ్మడి కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. సాతులూరు గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ప్రజాదీవెనలో ఆమె పాల్గొన్నారు. మాజీ సర్పంచ్‌లు సీహెచ్ రాధాకృష్ణ, జి.మురళీకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ జి.కొండలరావు, గ్రామ పార్టీ కన్వీనరు బి. ఆంజనేయులు, ఆర్‌బీకే చైర్మన్ బి. కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ గ్రామస్తులకు కరపత్రాలు అందజేసి వైఎస్సార్ సీపీ పెడన అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉప్పాల రాముకు, మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వి. చినబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు టి. శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పి. బాబూరావు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, నాయకులు బి. గాంధీ, పి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలుత దళితవాడలో హారిక స్థానికులతో మాట్లాడారు.

మేలు చేసిన జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



దాలిపర్రులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు కుమార్తెలు ఉజ్వల, నిశ్చల తదితరులు

దాలిపర్రు(ఘంటసాల): ప్రజలకు మేలు చేసిన జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కుమార్తెలు ఉజ్వల, నిశ్చల అన్నారు. ఘంటసాల మండలం దాలిపర్రు, దేవరకోట గ్రామాల్లో ఎమ్మెల్యే సింహాద్రి కుమార్తెలు ఉజ్వల, నిశ్చల, చాణుక్య, స్థానిక నేతలతో కలసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దాలిపర్రు ఎస్సీ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ డోకిపర్తి శాంత కుమారితో కలసి నివాళులర్పించగా, దేవరకోట ఎస్సీ కాలనీల్లో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ ఎంపీటీసీ నలకుర్తి రవిచంద్ర, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపీటీసీ రాములమ్మ, యువనేత సింహాద్రి చాణక్యతో కలసి నివాళులర్పించారు.

అనంతరం దాలిపర్రు, దేవరకోట గ్రామాల్లో వారు ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా సింహాద్రి రమేష్ బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావుకు సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రావు, జెడ్పీటీసీ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ నాగరాజు, సర్పంచ్లు శాంతకుమారి, పట్టాభి రామారావు, సచివాలయాల మండల కన్వీనర్ ప్రవీణ్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు శరత్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓపీవోలకు.. రేపు ఇతరులకు పోస్టల్ బ్యాలెట్

- అనివార్య కారణాలతో ఓటు వేయని వారికి 7, 8 తేదీల్లో అవకాశం
- పెడన ఎన్నికల అధికారి వెంకటరమణ వెల్లడి

పెడన: పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులు ఫారం -12 దరఖాస్తు చేసుకున్న ఇతర పోలింగ్ అధికారులకు(ఓపీవో)లకు ఆదివారం పెడన మండలంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టల్‌బ్యాలెట్‌కు అవకాశం కల్పించామని పెడన ఎన్నికల అధికారి వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 5వ తేదీ ఆదివారం ఓపీవోలకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

6వ తేదీ సోమవారం పోలీస్, ఏపీఎస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఆర్వో సిబ్బంది, మెడికల్ సిబ్బంది, ఇతరులకు సోమవారం పోస్టల్ బ్యాలెట్ వేయాలని ఈఆర్వో పేర్కొన్నారు. అనివార్యకారణాలతో ఓటు వేయనివారు 7, 8వ తేదీల్లో పెడన తహసీల్దార్ కార్యాలయంలోని ఈఆర్వో కార్యాలయం వద్ద ఈ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోదలిచిన వారికి స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు.